RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 318 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | మంగళవారం, 21 మే 2024 | పేజీలు : 4 | వెల : 2/-




# రైతుకు నష్టం రానివ్వం

## ధాన్యం కొనుగోలు బాధ్యత కలెక్టర్లదే..

హైదరాబాద్: తెలంగాణ కేబినెట్ సమావేశం ముగిసింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మూడు గంటలకు పైగా కొనసాగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకల్ని ఘనంగా నిర్వహించాలని, ఈ వేడుకలకు ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీని ఆహ్వానించాలని కేబినెట్ నిర్ణయించింది. ధాన్యం కొనుగోళ్లపై పూర్తి బాధ్యత కలెక్టర్లకే అప్పగించారు. రైతులకు నష్టం జరగకుండా చివరి గింజ వరకూ కొనాలని సీఎం ఆదేశించారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్‌బాబు మీడియాకు వెల్లడించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే సేకరించాలని నిర్ణయం. ఎంఎస్‌పీ కంటే ఒక్క రూపాయి కూడా తక్కువ చెల్లించకూడదని నిర్ణయం. రాష్ట్రానికి అవసరమైన సన్న బియ్యం అంతా రాష్ట్రంలోనే సేకరిస్తాం. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్. నకిలీ విత్తనాల విక్రయదారులపై కఠిన చర్యలు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు రూ.600 కోట్లు కేటాయింపు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ. కాళేశ్వరం ప్రాజెక్టులో మరమ్మతులు చేయాలని నిర్ణయం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులపై



నిపుణుల కమిటీ ఏం చెప్తే అది చేయాలని నిర్ణయం. మంత్రివర్గంలో మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన మధ్యంతర నివేదికపైనా చర్చించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం విషయంలో ఎన్‌డీఎస్‌ఏ సూచనలకనుగుణంగా వ్యవహరిస్తామని చెప్పారు. "మేడిగడ్డకు మరమ్మతులు చేస్తే.. సరి అవుతుందన్న గ్యారెంటీ లేదని, నీరు నిల్వ చేసే పరిస్థితి కూడా లేదని ఎన్‌డీఎస్‌ఏ కమిటీ చెప్పింది. అందుకే, తాత్కాలికంగా ఏమైనా ఏర్పాటు చేసైనా సరే రైతులకు నీరు ఇవ్వాలని భావిస్తున్నాం" అన్నారు.

**రాష్ట్ర అవతరణ వేడుకలకు కేసీఆర్‌కు ఆహ్వానం: మంత్రి శ్రీధర్ బాబు –** రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ప్రభుత్వం తరపున మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆహ్వానం ఇస్తామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. పాఠశాలలు పున:ప్రారంభమయ్యే జూన్ 12 లోగా విద్య వ్యవస్థలో మార్పులు చూపించాలని కెబినెట్ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. "మంత్రి వర్గ సమావేశంలో అనేక అంశాలు చర్చకు వచ్చాయి. ధాన్యం కొనుగోలు విషయంలో ఒక్క గింజ కూడా తరుగు లేకుండా తీసుకుంటాం. మూడు రోజుల్లో పేమెంట్ అయ్యేలా చూస్తాం. స్టాండింగ్ క్రాప్ అంశంలో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. వ్యవసాయ శాఖ మంత్రి అకాల వర్షాలపై సమీక్షిస్తున్నారు. విద్య వ్యవస్థకు సంబంధించి అన్ని చర్యలు పక్కాగా ఉంటాయి. పాఠశాల, సాంకేతిక, హై యర్ ఎడ్యుకేషన్‌ను గత ప్రభుత్వం విస్మరించింది. బోధన, బోధనేతర అంశాలపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాబోయే రోజుల్లో మానవ వనరులపై సమీక్ష నిర్వహిస్తాం. ఇందుకోసం రూ.600 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది" అని శ్రీధర్ బాబు తెలిపారు. ఇక మేడిగడ్డ అంశంలో ఎన్‌డీఎస్‌ఏ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ముందుకు వెళతామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. కేవలం సాంకేతిక పరమైన నిర్ణయాలను మాత్రమే పరిగణలోకి తీసుకోకుండా అన్ని అంశాలను ఇంజనీర్లతో మాట్లాడి ముందుకు వెళతామని తెలిపారు. మెడిగడ్డ, అన్నారం , సుందిళ్ళలను సందర్శిస్తామని ఆయన తెలిపారు.

**ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసి తీరుతాం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి –** ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసి తీరుతామని మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. " ధాన్యం కొనుగోలు అన్ని చోట్లా జరుగుతుంది. ఉత్తర తెలంగాణలో కొన్ని చోట్ల చేయాల్సి ఉంది. ధాన్యం కొనుగోలుపై బీఆర్ఎస్ చేసినవి అన్నీ డ్రామాలు. పదేళ్లు మీరు రైతుల కోసం ఏం చేశారో తెలుసు. ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేసి తీరుతాం. డీఎస్సీ నోటిఫికేషన్‌పై మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. గత పదేళ్లు ఉద్యోగాల నోటిఫికేషన్లు లేవు. కేబినెట్ భేటీకి సంబంధించిన చాలా అంశాలను జూన్ 5 న తెలియజేస్తాం. జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తాం" అని అన్నారు.

## కేసీఆర్‌కు... పట్టిన గతే జగన్‌కు..

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీలో కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

జగన్ ఇచ్చిన ఉచితాలకు.. ఆయన ఇంట్లో కూర్చుని గెలివాలని కాని ఆ పరిస్థితి లేదని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఓడించినట్లే.. జగన్ అహంకారమే ఆయనను ఓడిస్తోందని విమర్శించారు.జగన్.. అభివృద్ధిపై దృష్టి పెడితే మరోలా ఉండేదన్నారు. ఏపీ, తెలంగాణలో రోడ్లు దారుణంగా ఉన్నాయని అన్నారు.



సోమవారం మీడియాతో కిషన్‌రెడ్డి చిట్‌చాట్ నిర్వహించారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీని బీజేపీ ఖచ్చితంగా గెలుస్తోందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిపై గతంలో ఫైటర్ అనే అభిప్రాయం ఉండేదని.. ప్రస్తుతం అతనిపై బ్లాక్ మెయిలర్ అనే ముద్ర పడిందని విమర్శించారు. కాంగ్రెస్ క్యాడర్, లీడర్ ఆయనకు సహకరించటం లేదని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని... బీఆర్ఎస్ ప్రభావం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఎమ్మెల్సీ ఎన్నిక రావటం బీజేపీకి కలసి వచ్చిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# పెళ్లి కాలేదంట కానీ.. పిల్లలు పుట్టిండ్రంటా..





## రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ విమర్శలు

భద్రాద్రి కొత్తగూడెం : ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై పచ్చి అబద్ధాలాడుతున్న రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. పెళ్లి కాలేదంట.. సంసారం అయిపోయి పిల్లలు పుట్టింద్రంటా అని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను తాను ఇచ్చానని రేవంత్ అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇల్లందు నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో కేటీఆర్ పాల్గొని బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డికి మద్దతుగా ప్రసంగించారు. పచ్చి అబద్ధాలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యావంతులు కర్రుకాల్చి వాత పెట్టాలి. మీరు ఉదాసీనంగా ఉంటే మరిన్ని అబద్ధాలాడుతూ, అసలు హామీలే ఇవ్వలేదని అంటారు. మొదటి ఏడాదిలోపే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని రేవంత్ హామీ ఇచ్చిండు. ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా కొత్తగా ఇవ్వలేదు. కానీ 30 వేల ఉద్యోగాలు ఇచ్చాను అంటున్నాడు. ఒక ఉద్యోగం ఇవ్వాలంటే నోటిఫికేషన్, పరీక్ష, ఇంటర్వ్యూ జరిగిన తర్వాత నియామకం పత్రం ఇవ్వాలి. మరి రేవంత్ వచ్చిన తర్వాత ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారు..? ఒక్కంటే ఒక్కటి కూడా ఇవ్వలేదు. పెళ్లి కాలేదంట.. సంసారం అయిపోయి.. పిల్లలు మాత్రం పుట్టింద్రంటా.. ఎట్ల పుట్టింద్రు అంటే సమాధానం లేదు. అంటే 30 వేల ఉద్యోగాలు ఎక్కడి నుంచి వచ్చాయంటే బుకాయిస్తున్నాడు దబాయిస్తున్నాడు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చేశాను అంటున్నాడు. మరోసారి నిరుద్యోగులను పిచ్చోళ్లను చేయడానికి నోటికొచ్చినట్టు వాగుతున్నాడు. 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం.. నియామక పత్రాలు ఇచ్చింది మాత్రమే రేవంత్ రెడ్డి. ఈ సీఎంకు బుద్ధి చెప్పాలంటే, 2 లక్షల ఉద్యోగాల హామీ నెరవేరాలంటే, ఆ ఒత్తిడి ఉండాలంటే దమ్మున్న రాకేశ్ రెడ్డిని గెలిపిస్తే శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాడని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజుల్లేకుండా ప్రభుత్వ ఉద్యోగాల దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. కేసీఆర్ హయాంలో టెట్‌కు దరఖాస్తు ఫీజు రూ. 400 పెడితే.. ఇదే రేవంత్ నానా యాగీ చేసిండు. ఇవాళ టెట్ పరీక్షకు వెయ్యి పెట్టిండు.

ఇలాంటి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి. మొదటి కెబినెట్ సమావేశంలో మెగా డీఎస్సీ వేస్తామన్నారు. ఆ హామీ కూడా నెరవేరలేదు. సింగరేణిలో 24 వేల వారసత్వ ఉద్యోగాలు ఇచ్చాం. సింగరేణిని అదానీకి అమ్మేందుకు రేవంత్ సిద్ధంగా ఉన్నాడు. ఇదే విషయంపై మోదీతో రేవంత్ కూడబలుక్కున్నాడు. చివరకు సింగరేణిని కూడా ప్రయివేటుపరం చేస్తారు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## కిర్గిజ్‌స్థాన్‌లోని తెలంగాణ విద్యార్థుల భద్రతపై చర్యలు తీసుకోవాలి: హరీశ్‌రావు



హైదరాబాద్: కిర్గిజ్‌స్థాన్ దేశంలో భారత్, పాకిస్తానీ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని అక్కడి స్థానికులు దాడులకు తెగబడుతున్నారు. రాజధాని బిష్కెక్‌లో గత రెండు రోజులుగా స్థానికులు, విదేశీ విద్యార్థులకు మధ్య ఘర్షణలు తలెత్తుతున్నాయి. అక్కడ తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కూడా చాలా మంది ఉన్నారు. తెలంగాణలోని విద్యార్థులు కూడా చదువుతున్నారు. అక్కడ ఉన్న పరిస్థితులపై ట్విట్టర్(ఎక్స్) వేదికగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఓ ట్వీట్ చేశారు.

కిర్గిజ్‌స్థాన్‌లోని తెలంగాణ విద్యార్థుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఆ సంఘటనలతో తీవ్ర ఆందోళన..** "కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లోని భారతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని జగుతున్న హింసాత్మక సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. హింసలో పలువురు భారతీయ విద్యార్థులు గాయపడ్డారు. భారతీయ విద్యార్థులతోపాటు వివిధ దేశాల విద్యార్థులపై స్థానికులు దాడులు చేయడంతో పరిస్థితి దిగజారింది. కిర్గిజ్‌లోని తెలంగాణ విద్యార్థుల భద్రత కోసం వెంటనే పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయాన్ని, భారత ప్రభుత్వ అధికారులను గౌరవనీయులైన విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్‌ని, బిష్కెక్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని కోరుతున్నాను. ఈ సంక్షోభాన్ని గట్టెక్కడానికి, విద్యార్థుల భద్రతపై వారి కుటుంబాలకు భరోసా ఇవ్వడానికి దౌత్య పరంగా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.




## డాన్స్‌తో అదరగొట్టిన ఎస్పీ రోహిత్ రాజ్

కొత్తగూడెం జిల్లా: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మరోసారి సందడి చేశారు. కేసులతో బిజీగా ఉన్న ఆయన రిలాక్స్‌గా తెలుగు పాటలకు మాస్ స్టెప్‌లేసి ఆదరగొట్టారు. ఎస్పీ డ్యాన్స్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాలైన ఏజెన్సీ జిల్లాల్లో ఎన్నికల బందోబస్తును సక్సెస్ ఫుల్‌గా ముగియడంతో ఎస్పీ రోహిత్ రాజ్ గెట్ టూ గెదర్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాల్వంచలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రైవేటు పార్టీలో ఎస్పీ రోహిత్ రాజ్, పోలీస్ సిబ్బందితో కలిసి సరదాగా డ్యాన్స్ చేసి అలరించారు. కాగా ఎస్పీ రోహిత్ రాజ్ డ్యాన్స్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఎస్పీ హెూదాలో ఉండి.. తోటి ఉద్యోగులతో కలిసి మెలిసి సరదాగా ఉండటం అభినందనీయమని కామెంట్లు పెడుతున్నారు. గతంలో ఆయన చేసిన డ్యాన్స్ వీడియోలు కూడా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ఈ ఐదేళ్లు ప్రజలకు సేవ చేస్తా.. పాలేరే నా సొంత ఇల్లు

ఖమ్మం, మే 20: "గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడి నా గెలుపు కోసం శ్రమించి పనిచేసి అద్భుతమైన మెజారిటీతో గెలిపించారు.

మీ ఇంటి పెద్దకొడుకుగా మీ అందరి కోసం పనిచేస్తా" అని రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలో నిర్వహించిన ప్రజల వద్దకె శ్రీనన్న కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రఘురాం రెడ్డి గెలుపు కోసం కూడా అందరూ కృషి చేశారన్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం లేకుండానే ఈ ఐదు సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తానని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వం పేదలకు ఒక్క ఇళ్ళు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పాలేరు నియోజక



వర్గం తన సొంత ఇల్లు అని తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాల్లో పాలేరు నియోజకవర్గంలో ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా పేద వాళ్లలో అతి పెదవాళ్ళకి ఇళ్ళు ఇవ్వాలన్నది ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలేరులో ఏ ఒక్కరూ మంచినీటికి ఇబ్బంది పడకుండా చర్యలు చేపడతామన్నారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు నిర్మాణం చేస్తామని చెప్పారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు.

నిజమైన పేదవారికి సేవ చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని మరోసారి స్పష్టం చేశారు. వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. పాలేరు ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని పోగొట్టుకోనన్నారు. ఎన్నికలు ఉన్నా.. లేకపోయినా నిత్యం పాలేరు ప్రజల మధ్యే ఉంటానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# కేజ్రీవాల్ ఎఫెక్ట్

## ఇండియా కూటమిపై ఒత్తిడి!

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే.. ఈ ప్రభావం ఒక్క ఆయన పార్టీ ఆమ్ ఆద్మీపైనే కాకుండా కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలపైనా పడింది. ఇప్పుడు కేజ్రీవాల్‌ను రక్షించుకోకపోతే.. ఎన్నికల సమయానికి సగానికిపైగా పార్టీల అధినేతలు జైలు బాట పట్టే అవకాశం ఉందని ఇండియా కూటమి నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్‌ను సాధ్యమైనంత వేగంగా బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేయాలనే వ్యూహాలు అమలు చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయనను తక్షణం బయటకు తీసుకురావల్సిన అవసరం ఉంది. ఏం చేయాలనే దానిపై ఇండియా కూటమిలోని పార్టీలన్నీ వెంటనే ఒక సరైన నిర్ణయాన్ని తీసుకోవాలి అని ఆయన అన్నారు. కూటమి బలంగా ఉండాలనే విషయాన్ని తాను ముందు నుంచి చెపుతూనే ఉన్నానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలపై అందరం కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. లిక్కర్ పాలసీ కేసు జీరో కేసు అని... అప్రూవర్లుగా మారిన వారి వాంగ్మూలాలపైనే కేసు ఆధారపడి ఉందని అన్నారు. ఈ కేసులో ఆధారాలు లేవని, జరుగుతున్న తతంగం అంతా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని చెప్పారు. మరోవైపు.. ఆప్ సీనియర్ నాయకురాలు, ఢిల్లీ మంత్రిఅతిషి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇండియా కూటమిని దెబ్బతీసేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను సామూహికంగా ఎదుర్కొనవలసిన అవసరం ఉందని ఆమె చెప్పారు. ఈడీని అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో గెలవాలనుకోవడం సరైనది కాదని, దమ్ముంటే తమతో ఎన్నికల క్షేత్రంలో తలపడాలని మంత్రి అతిషి బీజేపీకి సవాల్ విసిరారు. ఈడీని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం బీజేపీ మానుకోవాలని హితవు పలికారు. బీజేపీ ఈ రోజు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మండిపడ్డారు. పార్టీ బ్యాంకు ఖాతాలను కూడా స్తంభింపజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఈ రకంగా గెలవాలని ప్రయత్నిస్తోందన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

# సహజ వనరులను కొల్లగొడుతున్నారు



పెద్దపల్లి : ఇసుక, మట్టి అక్రమ రవాణాతో జిల్లాలోని సహజవనరులను అక్రమార్కులు ధ్వంసం చేస్తున్నారు. మానేరు వాగు నుంచి ఇసుక రవాణాపై చెన్నైలోని జాతీయ హరిత ట్రైబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను అధికారులు గాలికి వదిలేయడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. వాగులో అడ్డగోలుగా ఇసుక తోడుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. చెరువులను కూడా వదిలి పెట్టకపోవడంతో అవి నామరూపాలు లేకుండా పోతున్నాయి. అధికారులు, నాయకుల నిర్లక్ష్యంతో అమూల్యమైన సహజవనరుల ఉనికి ప్రశ్నార్ధకంగా మారింది. యంత్రాల సహాయంతో రాత్రి పూట ఇసుక, మట్టి దర్జాగా రవాణా చేస్తున్నా అధికారులు కన్నెతి చూడటం లేదు.

చెరువులు, గుట్టలే లక్ష్యం

చెరువులలోని మట్టి ఇటుకబట్టీలు, ఇళ్ల నిర్మాణాలు, స్థిరాస్తి వెంచర్లు, ఇతర అవసరాలకు భారీగా అవసరముండడంతో అక్రమార్కులకు దీనినే ఆదాయ వనరుగా ఎంచుకున్నారు. పెద్దపల్లి మండలంలోని కనగర్తి చెరువులో మట్టితో పాటు మొరం కూడా కొల్లగొడుతున్నారు. ఉపాధి కూలీలు తవ్విన ప్రాంతంలోని గుంతలే లక్ష్యంగా చేసుకుని చెరువులను తవ్వుతున్నారు. దీంతో వాటిల్లో నీటి నిల్వ సామర్థ్యం పడిపోయే ప్రమాదం ఉంది. గుంతల్లో వర్షాలకు నీరు నిలిచి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గౌరెడ్డిపేట, ముత్తారం, బొంపల్లి, తుర్కలమద్దికుంట గ్రామాలలోని గుట్టప్రాంతాలనూ వదిలిపెట్టడం లేదు. అక్కడ మట్టిని తోడుతుండటంతో అటవీ ప్రాంతంలో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. వీటి వల్ల వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు కూడా స్థలం లేకుండా పోతుంది. మైనింగ్ శాఖ గుర్తించిన క్వారీలలో కాకుండా ఎక్కడ పడితే అక్కడే అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తుండడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. రూపు మారిన హుస్సేన్‌మియా వాగు జిల్లాలోని హుస్సేన్‌మియా వాగులో నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా ఇసుక రవాణాతో దాని రూపం మారిపోతుంది సుల్తానాబాద్ మండలం కొదురుపాక, చిన్నకల్వల, పెద్దపల్లి మండలం పెద్దకల్వలలోని వాగు పరీవాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. యంత్రాలతో తవ్వకాలు చేపట్టడంతో అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు ఈ గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఈ అక్రమాలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. అధికారులు ప్రేక్షకపాత్ర పోషించడంపై ఆయా గ్రామాల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై జిల్లా మైనింగ్ ఏడీ శ్రీనివాస్‌ను వివరణ కోరగా పెద్దపల్లి జిల్లాలో బిట్టుపల్లి, అల్లూరు, జూలపల్లిలో మాత్రమే మట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చామని.. ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న తవ్వకాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# 'పల్లె'వించిన చైతన్యం..



పెద్దపల్లి : ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంలో పల్లెలు స్ఫూర్తి చాటాయి. నగర వాసుల కంటే గ్రామీణ ఓటర్లు ఆదర్శంగా నిలిచారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు, ఎన్నికల రోజు సెలవు ప్రకటించిన పట్టణ ఓటర్లలో నిర్లిప్తత వీడలేదు. దీనికి భిన్నంగా గ్రామీణ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వారి కర్తవ్యాన్ని నిర్వర్తించారు. పెద్దపల్లి పార్లమెంటు స్థానంలో ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఓటింగ్ గత ఎన్నికల కంటే స్వల్పంగా పెరిగింది.

గ్రామాలే ముందు

లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పలు గ్రామాల్లో అధికంగా పోలింగ్ శాతం నమోదు కాగా.. పట్టణ ప్రాంతాల్లో మాత్రం నామ మాత్రంగానే నమోదయింది. చెన్నూరు నియోజకవర్గంలోని ఇసన్వాయి పోలింగ్ కేంద్రం 207లో 83.91 శాతం, బెల్లంపల్లి నియోజకవర్గం సోనాపూర్‌లో 92.02, మంచిర్యాలలోని తలమాల పోలింగ్ కేంద్రం 66లో 86.42, ధర్మపురిలోని కప్పరావుపేట పోలింగ్ కేంద్రం 83లో 84.19, రామగుండంలోని ఆకెనపల్లిలో 80.78, మంథని నియోజకవర్గం కామన్‌పల్లిలో 95.33, పెద్దపల్లిలో దుబ్బపల్లిలో 84.34 శాతం మంది ప్రజలు ఓటు వేశారు. పట్టణ ప్రాంతాలైనా క్యాతన్‌పల్లిలోని పోలింగ్ కేంద్రం 78లో 45.82 శాతం, బెల్లంపల్లిలోని 49 పోలింగ్ కేంద్రంలో 48.30, నస్పూర్‌లోని పోలింగ్ కేంద్రం 243లో 26.99, ధర్మపురిలోని పోలింగ్ కేంద్రం 39లో 55.56, ఎన్టీపీసీలోని మేడిపల్లి 62 పోలింగ్ కేంద్రంలో 31.86, నిర్వాసిత ప్రాంతమైన మంగళపల్లిలో 24.44, పెద్దపల్లిలోని 36 పోలింగ్ కేంద్రంలో 45.77 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ధర్మపురిలో అధికం లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పట్టణ ప్రాంతాలు అయినటువంటి రామగుండం, మంచిర్యాలలో పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. ఈ నియోజకవర్గాల్లో ఎక్కువగా గ్రామీణ ఓటర్లు ఓటేసేందుకు ఉత్సాహం చూపగా నగర ఓటర్లు ఇళ్లకే పరిమితమయ్యారు. మొత్తం 15,86,430 మంది ఓటర్లు ఉండగా వీరిలో 10,83,453 మంది చేతి వేలికి సిరా చుక్క అంటించుకున్నారు. అత్యధికంగా గ్రామీణ ప్రాంతమైన ధర్మపురిలో 73.34 శాతం, అత్యల్పంగా రామగుండంలో 61.59 శాతం పోలింగ్ జరిగింది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో మహిళ ఓటర్లు తక్కువే అయినప్పటికీ ఎన్నికల్లో వారి ఓట్లే ఎక్కువగా పడ్డాయి.

# ఖాతాకమామీషు

ఇల్లెందు : సైబర్ నేరగాళ్ల అక్రమ లావాదేవీలకు బ్యాంకు ఖాతాలు సమకూర్చుతున్న ముఠాల మూలాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా చుట్టూ విస్తరించి ఉంటున్నాయి. అక్రమార్కులకు కొందరు డబ్బు ఆశతో గుట్టుగా ఖాతాలు సమకూర్చిపెడుతున్నారు. డిజిటల్ బ్యాంకింగ్ ప్రపంచంలో ఇదో కొత్తరకం మోసంగా నిపుణులు చెబుతున్నారు. ఎవరినీ గుడ్డిగా నమ్మి ఆధారాలు ఇవ్వొద్దని వినియోగదారులను హెచ్చరిస్తున్నారు.

బెట్టింగ్ కోసం.. 'మహా' మోసం

నిర్మల్ జిల్లా భైంసా వాసులతో ఖాతాలు తెరిపించి.. వాటిని ఆన్‌లైన్ బెట్టింగ్ లావాదేవీలకు వినియోగించిన కేసులో కీలక నిందితుణ్ని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో బృందం బెంగళూరులో బుధవారం పట్టుకుంది. నిందితుడు కేశవరెడ్డి అలియాస్ మహా ఖమ్మం వాసిగా గుర్తించడం కలకలం రేపుతోంది. నిందితుడికి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ వ్యసనం ఉన్నట్లు విచారణలో తేలగా, సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన కొందరు వ్యక్తుల కోసం మ్యూల్ ఖాతాలు తెరిచే దందా కొనసాగిస్తున్నట్లు సైబర్ నిపుణులు గుర్తించారు. కాసులు, కమీషన్ల కక్కుర్తితో..

భద్రాద్రి జిల్లా ఇల్లెందుకు చెందిన ఐదుగురు మహిళల పేరిట మూడు నెలల క్రితం వారికి తెలియకుండా 'మ్యూల్ కరెంట్ ఖాతా'లు తెరిచారు. వాటిల్లో రూ.కోట్లల్లో లావాదేవీలు జరగడంతో మోసం బయటపడింది. ఈ కుట్రను స్థానిక పోలీసులు ఛేదించగా.. దుబాయ్ అడ్డాగా ఇద్దరు నేరస్థులు రూ.కోట్లలో లావాదేవీలు జరిపినట్లు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు వెల్లడించారు.బెట్టింగ్, సైబర్ నేరాలు, ఇతర అక్రమ సంపాదనకు సంబంధించిన ఆన్‌లైన్ లావాదేవీలను వేరొకరి (సంబంధం లేని వ్యక్తులు) ఖాతాల్లో నిర్వహిస్తారు. వీటినే 'మ్యూల్' ఖాతాలుగా బ్యాంకింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. రుణాలు, డబ్బు కమీషన్ ఆశచూపి కొందరు దళారులు నిరక్షరాస్యులు, పరిచయస్థుల ఆధారాలను సంపాదించి.. అక్రమ మార్గంలో ఖాతాలు తెరుస్తున్నారు. ఆ వివరాలు సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్నారు. ఇటీవల ఇల్లెందులో ఇదే దందా వెలుగుచూడగా.. ఏకంగా దుబాయ్‌కి చెందిన సైబర్ నేరస్థులు రూ.కోట్లల్లో లావాదేవీలు నిర్వహించిన వైనం అవాక్కయ్యేలా చేసింది. విషయం తెలిసి లబోదిబోమనడం బాధితుల వంతైంది. ఖమ్మం, పాల్వంచ వంటి ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. పాల్వంచకు చెందిన ఓ వ్యక్తి తన బంధువైన మహిళ (ఖమ్మం వాసి) పేరుతో.. వారి కుటుంబానికి తెలియకుండా ప్రైవేటు బ్యాంకులో కరెంట్ ఖాతా తెరిచాడు. బంగారాన్ని తనఖాపై రూ.లక్షల్లో రుణాలు తీసుకున్నాడు. ఇటీవల తాను కొనుగోలు చేసిన స్థలం కోసం రుణం తీసుకుందామని బ్యాంక్‌కు వెళ్లాక కానీ, ఆమె పేరుతో వేరేచోట ఖాతా ఉన్న విషయం బాధిత కుటుంబ సభ్యులకు తెలియలేదు. సిబిల్ సమస్యతో ఇబ్బంది పడ్డారు.పార్ట్‌టైం ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతోనూ ముఠాలు విద్యావంతులకు వల విసురుతున్నాయి. వేరొకరికి ఆధార్, గుర్తింపు కార్డులు, ఫొటోలు ఇచ్చేముందు ఒకటికి పదిసార్లు ఆలోచించాలి.



ఎవ్వరినీ నమ్మొద్దు..

సైబర్ నేరగాళ్లకు 'మ్యూల్ ఖాతాలు' సమకూర్చేవారు రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. కమీషన్లు భారీగా తీసుకుంటున్నారని 'మహా' ఉదంతంలో బయటపడింది. ఈ-మెయిల్స్, చాట్ రూంలు, సామాజిక మాధ్యమాల ద్వారా అక్రమార్కులు పరిచయం చేసుకుని బాధితుల పేరుతో ఖాతాలను సులభంగా తెరుస్తున్నారు. ఎవరైనా డబ్బు ఆశచూపి పాన్, ఆధార్, ఫోన్ నంబర్ వంటి ఆధారాలు కోరితే తెలపొద్దని బ్యాంకుల అధికారులు హెచ్చరిస్తున్నారు.డ్వాక్రా తరహా రుణాలు, డబ్బులకు ఆశపడి గ్రామీణ ప్రాంత మహిళలు మోసగాళ్ల వలకు చిక్కుతున్నారు. వేరొకరికి ఆధారాలిచ్చి నష్టపోవద్దన్నది అధికారుల సూచన. ఫోన్, ఈ-మెయిల్‌లకు వచ్చే సందేశాలను ఓ కన్నేసి ఉంచడం ద్వారా మ్యూల్‌ఖాతా వంటి మోసాలు గుర్తించొచ్చని సైబర్ పోలీసులు సూచిస్తున్నారు. 'ఈ-కేవైసీ' చేయించడం, లావాదేవీల మెసేజ్‌లు సెల్‌ఫోన్‌కు వచ్చేలా చూసుకోవాలి.

కొందరు సేవా కేంద్రాల నిర్వాహకులు, ఏజెంట్లు మ్యూల్ ఖాతాలు తెరిచే అవకాశం ఉన్నట్లు ఓ బ్యాంక్ మేనేజర్ అభిప్రాయడ్డారు. ఇల్లెందు ఘటనలో వారి చెంతకే ఖమ్మం నుంచి బయోమెట్రిక్ యంత్రాన్ని తీసుకొచ్చారు. ఇలాంటి విషయాల్లో తగు జాగ్రత్తలు పాటించాలి.

రుణాల ఆశతో మధ్యవర్తు చేతికి ఎలాంటి పత్రాలు ఇవ్వకుండా జాగ్రత్తపడాలి. లేదంటే అక్రమ ఖాతాలు తెరిచి బెట్టింగ్‌లకు వినియోగించే వీలుంది.మీసేవ, జిరాక్స్ దుకాణాలకు వెళ్లినప్పుడు వారు పత్రాల నకళు అట్టిపెట్టుకోకుండా గమనించాలి.

మరణించిన వారిపేరు మీదనున్న ఖాతాలను మూసేయాలి. నకిలీ ఖాతాలు, సైబర్ నేరాలపై డయల్ 100, 1930 టోల్ ఫ్రీకి ఫిర్యాదు చేయాలి

# పోకల్‌వాడ భూముల కబ్జాపై దర్యాప్తు

హైదరాబాద్: మణికొండ ఐటీ కారిడార్ సమీపంలోని పోకల్‌వాడలో ఐదెకరాల భూమి కబ్జా వ్యవహారం కీలకమలుపు తిరిగింది. రూ.200కోట్ల విలువైన భూముల ఆక్రమణల వెనుక కొందరు రెవెన్యూ అధికారులు, రియల్ వెంచర్ల ప్రతినిధులున్నారన్న సమాచారంతో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీస్ అధికారులు తాజాగా కేసు నమోదు చేశారు. ఐదెకరాలు కబ్జా చేసిన పూస ప్రహ్లాద్, పూస రవీందర్‌ల వెనుక వారుండి కథ నడిపించారని ప్రాథమిక ఆధారాలు లభించడంతో మరింత దర్యాప్తు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతుండగా.. గండిపేట్ మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి అనుమానం వచ్చి సర్వే నంబర్లను పరిశీలించగా.. అక్రమార్కుల మోసం బయటపడింది. ఇది రూ.వందల కోట్ల ఆర్థికనేరంగా భావించి పోలీసులు కేసును ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు.

మరికొన్ని చోట్ల కూడా..





పోకల్‌వాడలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన పూస రవీందర్, పూస ప్రహ్లాద్‌లు మరికొన్ని చోట్ల కూడా ప్రభుత్వ భూములను తప్పుడు పత్రాలతో స్వాహా చేసుకునేందుకు యత్నించారని రెవెన్యూ అధికారులు గుర్తించారు. వీరిపై గతేడాది డిసెంబరులో ఆదిభట్ల ఠాణాలో కేసు నమోదైంది. రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ధరణి విభాగంలో విధులు నిర్వహిస్తున్న పొరుగుసేవల సిబ్బంది సహకారంతో రికార్డుల్లో మార్పులు చేయించారంటూ పోలీసులు అనుమానిస్తున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా కోర్టుల్లో రిట్ పిటిషన్లు దాఖలు చేసి.. విచారణ చేయండి అంటూ స్థానిక కోర్టులు ఉత్తర్వులు జారీ చేయగానే కిందిస్థాయి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారని పోలీసులు తెలుసుకున్నారు.

# ఇక 'స్థానికం'!

కరీంనగర్ : లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల తీర్పు ఈవీఎంలో పదిలమైందో లేదో.. అటు నాయకులు, ఇటు అధికారులు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారిస్తున్నారు. లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రశాంతంగా ఎన్నికల తంతు పూర్తవడంతో యంత్రాంగమంతా ఊపిరి పీల్చుకుంది. ఇదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన పనులపై దృష్టి పెట్టింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ దిశగా పచ్చ జెండా ఊపినా సిద్ధంగా ఉండాలని, అందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇదివరకే ఆదేశాలివ్వడంతో లోక్‌సభ ఎన్నికల ముందు నాలుగు జిల్లాల్లోనూ కసరత్తు జరిగింది. తాజాగా ఇదే తరహాలో జిల్లా పంచాయతీ అధికారులు గతంలో చేపట్టిన ప్రక్రియకు అదనంగా అవసరమైన సమాచారాన్ని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. పోలింగ్ కేంద్రాల విషయంలో కొంత స్పష్టత రావడంతో బ్యాలెట్ డబ్బాలు ఇతరత్రా ఏర్పాట్ల కోణంలో తగు శ్రద్ధను కనబరుస్తున్నారు. గతంలో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం జిల్లాల నుంచి రిజర్వేషన్ల జాబితాను పంపించారు. గత ఎన్నికల్లో అవలంబించిన విధానాలు, స్టేషనరీ ఇతర ఖర్చు మొదలగు సమాచారాన్ని నివేదిక రూపంలో అందజేశారు.

క్షేత్రస్థాయిలో కోలాహలమే!

వరుసగా శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ఇక తమ




వంతు అని గ్రామ స్థాయి నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వచ్చే నెల 4వ తేదీన వెలువడే లోక్‌సభ ఎన్నికల ఫలితాల తరువాత కోడ్ ముగియనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కూడా లోక్‌సభ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికల్ని నిర్వహిస్తామని ప్రకటన చేసింది. ఇదే జరిగితే వచ్చే మూడు నెలలపాటు నాలుగు జిల్లాల్లో ఊరూరా కోలాహలమే కనిపించనుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. మొదట సర్పంచి ఎన్నికలను నిర్వహించాల్సి వస్తే ఉమ్మడి జిల్లాలోని 1,218 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు మూడు విడతలుగా నిర్వహించే అవకాశం ఉంది. తరువాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిపే అవకాశముంది. దీంతో కొత్తగా ఏర్పాటైన బీమారం, ఎండపల్లి మండలాల్లో కొత్తగా ఎంపీపీ, జడ్పీటీసీలు తొలిసారిగా ఎన్నికయ్యే అవకాశం వచ్చే ఎన్నికల్లో ఉండనుంది. జగిత్యాల జిల్లాలో 20 మండలాలు, కరీంనగర్ జిల్లాలో 15, పెద్దపల్లి జిల్లాలో 14, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 13 మండలాల్లో క్షేత్రస్థాయిలో సందడి నెలకొననుంది.

ఊహల్లో ఆశావహులు..

ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గ్రామ, మండల స్థాయిలో కష్టపడిన ఆయా పార్టీల నాయకులు ఇప్పుడు తమ లక్ష్యమంతా స్థానిక సంస్థల్లో పోటీ చేయడమే అని స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో సర్పంచికి పోటీ చేసే విషయంలో ఈ సారి గట్టిపోటీయే కనపడుతోంది. మూడు ప్రధాన పార్టీల మద్దతుతో బరిలో నిలవాలనుకునే వారు ఆశల లోకంలో విహరిస్తున్నారు. గతంలో పోటీ చేసి ఓడిపోయిన వారితోపాటు కొత్త వాళ్లు ఈ పదవిపై కన్నేస్తున్నారు. ఇందుకోసం ఏ పార్టీ మద్దతు ఉంటే తమకు లాభం ఉంటుందనే విషయమై ఇప్పటికే అంచనాకు వచ్చి మొన్నటి ఎన్నికల్లో కొందరు పార్టీలు మారారు. ఈ ఎంపీ ఎన్నికల ఫలితాల తరువాత పార్టీల మార్పు కొనసాగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు పార్టీల బీ-ఫారాలు అవసరం ఉండటంతో కొందరు నాయకులు ఇప్పటి నుంచే తమ పార్టీ ముఖ్యులను కలుస్తూ శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో తాము కష్టపడిన తీరుని వివరిస్తూ మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తంగా స్థానిక సంస్థల ఎన్నికలపైనే అందరి దృష్టి మళ్లడంతో రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడం.. రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి అన్నట్లు గ్రామాల్లో పరిస్థితి ఉంది.

# సౌకర్యాలు కరవాయె.. రైతన్నకు దిగులాయె

పరిగి : ధాన్యం సేకరణ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నా క్షేత్ర స్థాయిలో అరకొరగానే ఉన్నాయి. జిల్లాలోని పలు కేంద్రాల్లో ఆరుబయటే రైతులు ధాన్య రక్షణకు పడుతున్న వెతలు అన్నీ ఇన్నీకావు. ప్రతి కేంద్రంలో తాడిపత్రులు (టార్పాలిన్లు) అందుబాటులో ఉంచినట్లు అధికారులు చెబుతున్నా అనేకచోట్ల అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలో పరిశీలనాత్మక కథనం.

చిరిగిన బస్తాలే దిక్కు: యాసంగి సాగుకు సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం 124 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు కేవలం 12,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాకు వాస్తవంగా 30లక్షల గోనెసంచులు అవసరం ఉండగా ఇప్పటివరకు 20లక్షల మేరకు సరఫరా జరిగింది. అత్యవసర పరిస్థితుల్లో కొరత లేకుండా చూస్తున్నామని చెప్పినా చిరిగిన సంచులే పంపిణీ చేశారు.

ఇళ్లనుంచి తెచ్చిన వాటినే కప్పుతున్నారు

యాలాల మండలం పగిడిపల్లి కొనుగోలు కేంద్రంలో రైతులు ఇళ్ల నుంచి వెంట తీసుకు వచ్చిన టార్పాలిన్లనే సాయంత్రం కాగానే బస్తాలపై కప్పుతున్నారు. దీనికి తోడు గోనె సంచులు అందుబాటులో ఉండటంలేదు. తూకం పూర్తయిన ధాన్యం గోదాంలకు తరలించేందుకు అవసరమైన లారీలు కూడా కేంద్రానికి రావడం లేదు. వీటికోసం



రాత్రికి అక్కడే ఉండాల్సి రావడంతో ఆహారానికి, వసతికి అవస్థలు పడుతున్నారు. ః మోమిన్‌పేట కొనుగోలు కేంద్రం రైతులకు కొంత మేర లాభదాయకంగా మారింది. విక్రయాలకు బహిరంగ విపణులకు తరలించే సమయంలో ఎదురయ్యే రవాణా ఇబ్బందులు, ఛార్జీల భారం తగ్గుతుందని కొందరు రైతులు తెలిపారు. ః ధారూర్ మండల పరిధిలో గతంలో ఎదురైన అవస్థలను దృష్టిలో ఉంచుకొని గోనె సంచుల కొరత లేకుండా చూస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నా కార్యాచరణ లేదు.

కొత్త బస్తాలు పంపిణీ చేయాలి

– జి.శ్రీనివాస్, రైతు, బాస్‌పల్లి

చిరిగిన బస్తాలు కాకుండా కొత్త వాటిని సరఫరా చేయాలి. రెండు మూడేళ్లుగా చిరిగినవే అందుతున్నాయి. పొలాలు, ఇళ్లవద్దే తూకం వేసుకుపోవాల్సి రావడం ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి.

మౌలిక సౌకర్యాలు కల్పించాం

– రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి అన్ని కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాం. జిల్లా వ్యాప్తంగా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఎక్కడైనా చిరిగిన బస్తాలు వస్తే బాగున్నవి పంపిస్తాం. వాతావరణ సూచన తెలిపే యాప్ ప్రతి కేంద్రంలో ఉండటంతో నిర్వాహకుల ద్వారా ముందుస్తు సమాచారం అందజేస్తాం.

# అకాల చినుకు..అన్నదాతకు వణుకు

దౌల్తాబాద్ : రైతన్న అనుకున్నంతా అయింది. అకాల వర్షం పడితే తాము పడిన కష్టం అంతా నీటి పాలవుతుందని నిత్యం ఆకాశంలో మబ్బులు పడితే ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షానికి రోడ్లపైన, కల్లాల వద్ద, ఇళ్ల ముందు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన ధాన్యం తడిసి అన్నదాతకు నష్టాన్ని మిగిల్చింది.దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై సుమారు 30 మంది రైతులు రెండు వేల బస్తాలకు పైగా ధాన్యాన్ని ఆర బెట్టారు. గన్నీ సంచుల కొరతతో వారం రోజులుగా అక్కడే నిరీక్షిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ధాన్యం తడిసి తీవ్ర ఆవేదన చెందారు.

ధారూర్ మండల కేంద్రలో కొనుగోలు కేంద్రాల వద్ద, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. నాగారం కొనుగోలు కేంద్రం వద్ద తూకం కోసం తీసుకువచ్చిన ధాన్యం, నిల్వ చేసిన బస్తాలు నీటిలో తడిసిపోయాయి. యాలాల మండల కేంద్రంతో పాటు బెన్నూర్, జక్కేపల్లి, బెన్నూర్, అక్కంపల్లి, జుంటిపల్లి, తిమ్మాయిపల్లి తదితర గ్రామాలలో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు టార్పాలిన్ కవర్లు కప్పినా వరద నీరు సంచుల కిందకు చేరింది. దీంతో రైతులు ఆ నీటిని చేతులతో ఎత్తి పోశారు. బెన్నూర్ కొనుగోలు కేంద్రం వద్ద రైతులు నానా ఇబ్బందులు పడ్డారు.

ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దు

దౌల్తాబాద్‌లో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు



కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ సూచించారు. ఆయన మండల కేంద్రం, గోకఫస్లావాద్, బాలంపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. తేమ శాతాన్ని పరిశీలించారు.

త్వరగా లారీల్లోకి ఎక్కించాలి జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ గురువారం బొంరాస్‌పేట మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం బస్తాలు సేకరించడం, లారీల్లో ఎక్కించడం వంటి పనులు త్వరగా జరిగేలా చూడాలని ఆదేశించారు. అకాల వర్షాలు పడుతున్నందున రైతులు అండగా నిలవాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. పరిగి మండలం సుల్తాన్‌పూర్, బొంరాస్‌పేటలో సేకరణ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణబాయి తదితరులున్నారు.

# ఉప కులపతిగా అవకాశం దక్కేదెవరికో?



కరీంనగర్ : రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల ఉపకులపతుల పదవీకాలం ఈనెల 21తో ముగియనుండంతో నియామక ప్రక్రియ చేపట్టేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సంకసాల మల్లేశ్ పదవీకాలం ముగియనుండటంతో ఆయన మరోమారు దరఖాస్తు చేసుకున్నారు. ఆచార్యుల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ముగ్గురు ఆచార్యుల పేర్లను ఎంపిక చేసి, ప్రభుత్వానికి.. అక్కడి నుంచి గవర్నర్‌కు పంపిస్తారు. గవర్నర్ ఆమోదంతో వీసీ నియామక ప్రక్రియ పూర్తవుతుంది.

గత ప్రభుత్వ తీరుతో అర్హత కోల్పోయాం..: వీసీగా నియామకం కావాలంటే కనీసం పదేళ్లు రెగ్యులర్ ప్రాతిపదికన ప్రొఫెసర్‌గా పని చేసి ఉండాలని గత ప్రభుత్వం 2019లో నిబంధన విధించింది. కానీ కాంట్రాక్ట్, పర్మినెంట్ ఏదేని పదేళ్ల సర్వీసు ఉంటే సరిపోతుందనేది యూజీసీ నిబంధన. ఇదే నిబంధన పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోనూ కొనసాగుతోందని, స్థానిక ప్రొఫెసర్లు పలువురు చెబుతున్నారు. వీరిలో అధిక మందికి కాంట్రాక్ట్ పద్ధతిలో ఏళ్లుగా పని చేసిన అనుభవం ఉంది. గత ప్రభుత్వ నిబంధనతో వీసీగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోయామని ఆవేదన వెలిబుచ్చారు.ఇప్పటి వరకు ముగ్గురు..: 2008లో ఏర్పాటైన శాతవాహన విశ్వవిద్యాలయానికి ఇప్పటి వరకు ముగ్గురు ఉపకులపతులు పని చేశారు. 2008లో మైనారిటీ వర్గానికి చెందిన ప్రొ.ఇక్బాల్ అలీ, 2012లో ఓసీ సామాజిక వర్గానికి చెందిన కడారు వీరారెడ్డి పని చేశారు. అనంతరం 2015 నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగింది. 2021లో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మల్లేశ్‌ను నియమించారు. ఈ దఫా బీసీ సామాజికవర్గానికి చెందిన వారిని వీసీగా అవకాశం ఇవ్వాలని బీసీ కులాల ఐక్య వేదిక, బీసీ విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

# అనుసంధాన మార్గం పూర్తయ్యేనా!



పెద్దపల్లి : నిత్యం రద్దీగా ఉండే గ్రామాలతో రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారి నిర్మాణం ఆది నుంచీ నిర్లక్ష్యానికి గురవుతోంది. ఎల్కలపల్లిగేటు కాలనీ నుంచి గుంటూరుపల్లి, రొంపికుంట తదితర గ్రామాల మీదుగా మంథని – పెద్దపల్లి ప్రధాన రహదారిని కలిపే ఈ రోడ్డు నిర్మాణం కోసం డి.ఎం.ఎఫ్.టి. నిధులు రూ.2.5 కోట్లు మంజూరయ్యాయి. అంచనాలు రూపొందించి టెండర్లు నిర్వహించడంలో జాప్యం నెలకొంటోంది. సుమారు ఆరు నెలల క్రితం టెండరు పూర్తికాకుండానే హడావుడిగా అప్పటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పనులు మొదలుకాలేదు. శాసనసభ ఎన్నికలు పూర్తయ్యాక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మొదటి సారిగా గ్రామీణ ప్రాంత సమస్యలపై నిర్వహించిన సమీక్షలో ఈ రోడ్డు సమస్యే ప్రధానంగా చర్చకు రావడంతో ఆయన శ్రద్ధ కనబరిచారు. టెండరు ప్రక్రియ పూర్తి చేసి జనవరి 30న శంకుస్థాపన చేయడంతో రోడ్డు నిర్మాణం పనులు మొదలయ్యాయి. డి.ఎం.ఎఫ్.టి. నిధులు రూ. 2.5 కోట్లతో ఫెర్టిలైజర్ సిటీ నుంచి రొంపికుంట వరకు తారు రోడ్డు నిర్మాణం కోసం పనులు చేపట్టగా కొంతభాగం సిమెంటు రోడ్డు నిర్మించారు. కేవలం ఎల్కలపల్లిగేటు కాలనీలో మాత్రం సిమెంటు రోడ్డు నిర్మించిన గుత్తేదారు ఆ తర్వాత తారు రోడ్డు నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లుగా ఎల్కలపల్లిగేటు కాలనీ నుంచి రొంపికుంట వరకు రోడ్డును చదును చేయించారు. కొన్నిచోట్ల ఉన్న రోడ్డును తవ్వించారు. నిర్మాణం చేపట్టకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

గతుకుల రోడ్డుతో గ్రామీణుల పాట్లు

గతుకుల రోడ్డుతో ప్రజలు, రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పలు మార్లు నామమాత్రంగా రోడ్డు నిర్మాణం, గుంతల పూడ్చివేత పనులు చేపట్టినా కొద్ది రోజుల్లోనే నామరూపాల్లేకుండా పోయింది. దీనికి తోడుగా రామగుండం ఎరువుల కర్మాగారానికి నీటి సరఫరా కోసం రోడ్డును తవ్వి పైపులైన్లు వేశారు. పైపులైన్లు వేసే సమయంలో ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకోగా పైపులైను నిర్మాణం పూర్తి కాగానే రోడ్డు వేస్తామని ఎరువుల కర్మాగారం యాజమాన్యం హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. పైపులైను నిర్మాణం పూర్తికాగానే ఎరువుల కర్మాగారం యాజమాన్యం చేతులెత్తేసింది. ఎల్కలపల్లి, గుంటూరుపల్లి, రాణాపూరం, రొంపికుంట, సబ్బితం, పేరపల్లి, లింగాల తదితర అనేక గ్రామాలకు చెందిన రైతులు నిత్యం తమ వ్యవసాయ ఉత్పత్తులను రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై కూరగాయలు, పాలు విక్రయించుకునే గ్రామీణులు గతుకుల రోడ్డుతో నానా తంటాలు పడుతున్నారు. వర్షాకాలంలో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు నిర్మాణం కోసం ఆయా ప్రాంతాలకు చెందిన గ్రామీణులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం కనిపించడం లేదు. బురదమయంగా ఉన్న రహదారిలో రైతులు, రైతు కూలీలు నాట్లు వేసి గతంలో నిరసన తెలిపారు. ధర్నాలు చేపట్టారు. ఎట్టకేలకు డి.ఎం.ఎఫ్.టి. నిధులతో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నప్పటికీ అర్ధాంతరంగా ఆపేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తారు రోడ్డు నిర్మాణానికి ఇప్పుడే సరైన సమయం అయినప్పటికీ గుత్తేదారు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వర్షాకాలంలో తారు రోడ్డు నిర్మాణం పనులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. గతుకుల రోడ్డు బురదమయం కావడంతో మరిన్ని తిప్పలు తప్పేలా లేవని ప్రజలు అంటున్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన తారు రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# ప్రారంభించారు... తాళం వేశారు

కోనరావుపేట : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలను పాలకులు ఆర్భాటంగా ప్రారంభించారు. ఇది జరిగి నెలలు గడుస్తున్నా వైద్యులు, రోగులకు అందుబాటులో ఉంచలేదు. తాళాలకే పరిమితమయ్యాయి. దీంతో అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య వైద్య సిబ్బంది సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో అలంకారప్రాయంగా మారిన ఆరోగ్య ఉప కేంద్రాలపై కథనం.కోనరావుపేట మండల కేంద్రంతో పాటు సుద్దాల, మామిడిపల్లి, వట్టిమల్ల తదితర గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించారు. ప్రభుత్వం ఒక్కొక్క భవనానికి రూ.20 లక్షలు జాతీయ హెల్త్ మిషన్ నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో భవనాలను పూర్తి చేశారు. పాలకులు, ఉన్నతాధికారులు ఆర్భాటంగా వీటిని ప్రారంభించారు. ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రారంభించి నెలలు గడుస్తున్నా రోగులకు అందుబాటులోకి తీసుకురాలేదు. చిన్న చిన్న పనులు పూర్తి చేయాల్సి ఉందని తాళం వేసి వదిలేశారు. మరోవైపు అరకొర వసతుల మధ్య వైద్యులు రోగులకు సేవలు అందిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి భవనాలు పూర్తి చేసినప్పటికీ రోగులకు ఉపయోగపడని దుస్థితి నెలకొంది. గుత్తేదారులు పనులు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఎన్నికలు ముగియడంతో గుత్తేదారులు పనులు పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకువస్తే లక్ష్యం నెరవేరుతుంది. ఉన్నతాధికారులు కూడా ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



అరకొర వసతులతో...– ఉప్పుల ఆంజనేయులు, సుద్దాల

గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రం అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య ఏళ్లుగా కొనసాగుతోంది. వైద్యులు, రోగులకు సరైన వసతులు లేక ఇబ్బంది పడటంతో రూ. 20 లక్షల వ్యయంతో నూతన భవనం నిర్మించారు. చిన్న చిన్న పనులు చేయాల్సి ఉంది. వీటిని పూర్తి చేయకుండా ప్రారంభించి తరవాత తాళం వేయడంతో నిరుపయోగంగా ఉంది. పాలకులు, అధికారులు చొరవ చూపి అందుబాటులోకి తీసుకురావాలి.వైద్యశాఖకు అప్పగించలేదు– వేణుమాధవ్, మండల వైద్యాధికారి, కోనరావుపేటగ్రామాల్లో నిర్మించిన నూతన ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రారంభినప్పటికీ గుత్తేదారులు చిన్న చిన్న పనులు చేయాల్సి ఉంది. వాటిని పూర్తి చేసిన తరవాత వైద్యశాఖకు భవనాలు అప్పగించాల్సి ఉంది. ఇప్పటికే నూతన భవనాల్లో వైద్య సేవలు అందించడానికి వైద్యులు, ఏఎన్ఎంలు అందుబాటులో ఉన్నారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో సేవలు అందిస్తున్నారు. భవనాలకు తాళం వేసి ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

# బాహ్య వలయం.. అసంపూర్ణం

తాండూరు : తాండూరు నియోజకవర్గానికి తొలిసారిగా 'బాహ్య వలయ రహదారి' మంజూరైంది. సర్కారు నిధులు మంజూరు చేసి ఏళ్లు గడిచినా పనులు పూర్తి చేయించడం లేదు. దీంతో నిరుపయోగంగా మారింది. ఎప్పటికప్పుడు పెరుగుతున్న వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్యలు, రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. కాలుష్యంతో సతమతమవుతున్నారు. ఈనేపథ్యంలో కథనం.

12 కి.మీ. మేర అనుమతి

తాండూరులో బాహ్య వలయ రహదారి నిర్మించేందుకు 2016 సంవత్సరంలో రూ.78కోట్లు మంజూరయ్యాయి. వాటితో చెంగోల్ నుంచి అంతారం, అంతారంతండా, ఖాంజాపూర్, యాలాల మండలం రాజీవ్ గృహకల్ప, బషీర్‌మియా తండా, కోకట్ మీదుగా రాశులపురం వరకు 12 కిలో మీటర్ల రహదారి నిర్మాణానికి ఖరారు చేశారు. పనులు చేపట్టిన గుత్తేదారు చెంగోల్ నుంచి ఖాంజాపూర్ గేటు వరకు దాదాపు 8 కి.మీ. తారు రహదారి నిర్మించారు. మార్గమధ్యలో కొద్దిదూరం కంకరపరిచి వదిలేశారు. కొద్దిపాటి పనులు పూర్తి చేస్తే గౌతాపూర్ శివారులో తాండూరు–చించోళి జాతీయ రహదారి నుంచి ఖాంజాపూర్ గేటు వద్ద హైదరాబాద్ రహదారికి అనుసంధానంగా బాహ్యవలయ రహదారి అందుబాట్లోకి తెచ్చే వీలుంది.

వివాదాలు కొలిక్కి వస్తేనే ఏదైనా..: 8 కిలోమీటర్ల వరకు నిర్మించిన రహదారి మీదుగా రాకపోకలు సాగించే వీలుండగా గౌతాపూర్



శివారులో తన స్థలంలో రోడ్డు వేశారని, అంతారంలో మరో రైతు తనకు పరిహారం చెల్లించలేదని, అంతారంతండాలో ప్రభుత్వ స్థలంలో కాకుండా తన పట్టాభూమిలో రహదారి నిర్మించారంటూ పేచీ పెట్టారు. ఈ ముగ్గురి సమస్యలను పరిష్కరిస్తే బాహ్యవలయ రహదారి అరవై శాతం అందుబాట్లోకి వస్తుంది అధికారులు దృష్టి సారించడం లేదు.

ట్రాఫిక్ ఇక్కట్లు తగ్గుతాయి

సకాలంలో చర్యలు చేపడితే మల్కాపూర్, కోటబాస్పల్లి, సంగెంకలాన్, కరణ్‌కోట, ఓగీపూర్, బెల్కటూరు నుంచి వచ్చే సిమెంటు, నాపరాయి గనుల లారీలు పట్టణంలోకి ప్రవేశించకుండా నేరుగా బాహ్య వలయ రహదారి మీదుగా వెళ్లే వీలుంటుంది. దీంతో పట్టణంతోపాటు పరిసరాల్లోని గౌతాపూర్, అంతారం, ఎన్‌టీఆర్ కాలనీ, గ్రీన్‌సిటీ, మార్కండేయ కాలనీలకు ట్రాఫిక్ బాధలు తప్పుతాయి. ప్రమాదాలు, దుమ్ము, గాలి కాలుష్యం తగ్గుతాయి.

రైతుల అభ్యంతరాలు పరిష్కరిస్తాం

చెంగోల్ శివారు నుంచి ఖాంజపూర్ గేటు వద్ద హైదరాబాద్ రహదారి వరకు బాహ్యవలయ రహదారి నిర్మాణం దాదాపు పూర్తైంది. వినియోగంలోకి తెచ్చే సమయంలో ముగ్గురు రైతులు అడ్డుకున్నారు. వారి వివాదం పరిష్కరించేందుకు భూ సర్వే చేయిస్తున్నాం. మరొకరికి నష్ట పరిహారం చెల్లించి సమస్య తీర్చి రహదారిని త్వరలో అందుబాట్లోకి తెస్తాం. శ్రీనివాస్, డీఈ, రహదారులు భవనాల శాఖ, తాండూరు.

# హద్దులు చెరిపేసి.. చుట్టూ కంచె వేసి

హైదరాబాద్ : జంట జలాశయాలకు సమీపంలో ప్రభుత్వ, నిషేధిత భూముల వివరాలను సేకరించి కొందరు అక్రమార్కులు ఆక్రమించుకుంటున్నారు. హిమాయత్ సాగర్ సమీపంలోని సర్వే నంబర్ 69లో రూ.150కోట్ల విలువైన పది ఎకరాల నిషేధిత భూములను సొంతం చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించారు. రెవెన్యూ అధికారులకు అనుమానం రాకుండా వాటిని ప్రైవేటు పట్టాభూములుగా చూపించేందుకు ఇనుప కంచెలతో సరిహద్దు నిర్మించారు. అక్కడక్కడా మొక్కలు నాటి, బోర్లు తవ్వి నీటిని నింపేందుకు భారీగా కందకం తవ్వారు. రెండు నెలల నుంచి నీటిని లారీలు, ట్యాంకర్ల ద్వారా ఐటీ కారిడార్‌లోని కార్యాలయాలు, వసతిగృహాలకు సరఫరా చేస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. నీటిని తోడేందుకు విద్యుత్ స్తంభాల నుంచి అక్రమంగా తీగలు వేసుకున్నారు.

ఇలా ఆక్రమణ.. హిమాయత్ సాగర్ గ్రామంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అధికారులు స్థానికులకు వ్యవసాయం కోసమని 10 ఎకరాలు



ఇచ్చారు. కొన్నేళ్ల తర్వాత స్థానికులు రియల్ వ్యాపారంపై దృష్టిపెట్టారు. వారిలో కొందరు ప్రైవేటు వ్యక్తులకు భూములు అమ్మగా.. కొనుగోలుదారులు కంచెను నిర్మించుకున్నారు. 5 ఏళ్ల క్రితం కొందరు స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు స్పందించి స్థానికుల పేర్లు తొలగించి నిషేధిత భూములు(ప్రివెన్షన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) జాబితాలో చేర్చారు. ధరణి పోర్టల్‌లో ఖారీజ్ ఖాతా కింద నమోదు చేశారు.

అక్రమ బోర్లు.. నీటి విక్రయాలు

రెవెన్యూ అధికారులు సర్వేనంబర్ 69ని నిషేధిత భూముల జాబితాలో చేర్చినా.. 10 ఎకరాలకు సరిహద్దును, ప్రభుత్వ భూమి అనే సూచిక ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ భూములపై కన్నేసిన అక్రమార్కులు సొంతం చేసుకున్నారు. రైతుల భూముల్లా ఉండాలని అక్కడక్కడా చెట్లను పెంచుతూ బోర్లు వేసి నీటిని తోడి ఒక్కట్యాంకర్‌ను రూ. 2వేల వరకు విక్రయిస్తున్నారు. ఈ భూముల అక్రమణపై గండిపేట తహసీల్దార్ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా.. ప్రభుత్వ రికార్డుల్లో ఖారీజ్‌ఖాతా భూములుగా ఉన్నాయని, ఇవి ప్రభుత్వానివేనని స్పష్టం చేశారు.వాటిని పరిశీలించిన అనంతరం బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.




## బెంగళూరులో 100 మందితో రేవ్‌పార్టీ.. పట్టుబడ్డ తెలుగు టీవీ నటీనటులు!

బెంగళూరు: బెంగళూరు శివారులో నిర్వహించిన రేవ్ పార్టీలో పలువురు తెలుగు టీవీ నటీనటులు, మోడళ్లు పట్టుబడ్డారు. ఓ వ్యాపారవేత్తకు చెందిన ఫామ్ హౌస్‌లో బర్త్ డే పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దాడి చేశారు. దాదాపు 100 మందికి పైగా పార్టీకి హాజరయ్యారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే పార్టీకి వచ్చిన ఓ కారులో ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సంబంధించిన స్టిక్కర్ దొరికింది. పార్టీలో పలు రకాల డ్రగ్స్ వాడినట్లు పోలీసులు గుర్తించారు. 17 గ్రాముల ఎండీఎంఏ పిల్స్, కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫామ్ హౌస్ పరిసరాల్లో జాగ్వార్, బెంజ్ సహా ఖరీదైన 15 ఖరీదైన కార్లను జప్తు చేశారు. ఐదుగురిని అరెస్టు చేసిన ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బెంగళూరు రేవ్‌పార్టీతో నాకు ఎలాంటి సంబంధం లేదు: సినీనటి హేమ



హైదరాబాద్: బెంగళూరు శివారులో నిర్వహించిన రేవ్ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని సినీనటి హేమ స్పష్టం చేశారు. ఈ విషయంపై ఆమె ప్రత్యేక వీడియో విడుదల చేశారు. 'నేను ఎక్కడకు వెళ్లలేదు. హైదరాబాద్‌లోనే ఉన్నాను. ఇక్కడ ఫామ్‌హౌస్‌లో ఎంజాయ్ చేస్తున్నాను. నాపై వస్తోన్న వార్తలను నమ్మకండి. అవి ఫేక్ న్యూస్. అక్కడ ఎవరు ఉన్నారో నాకు తెలియదు. దయచేసి మీడియాలో నాపై వచ్చే వార్తలను నమ్మకండి' అని విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చింది: కేటీఆర్




ఇల్లందు: కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వ పాలన గురించి 6 నెలల్లోనే ప్రజలకు అర్థమైందని తెలిపారు. భారాస హయాంలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు చెప్పారు. ప్రైవేటు రంగంలో 24 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి చేసినట్లు వివరించారు. గత పదేళ్లలో ఏ రాష్ట్రం కూడా ఇన్ని ఉద్యోగాలు ఇవ్వలేదని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఉద్యోగాల కల్పనపై తాము సరిగా ప్రచారం చేసుకోలేదని చెప్పారు. గత 65 ఏళ్లలో రాష్ట్రానికి వచ్చిన వైద్య కళాశాలలు 3 మాత్రమేనన్నారు. తాము పదేళ్లలో 33 వైద్య కళాశాలలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వైద్య కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసినట్లు వివరించారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానానికి తీసుకెళ్లినట్లు కేటీఆర్ తెలిపారు.

## నియంత పాలనకు మోదీ కుట్ర..

### ఏం చేశారో చెప్పుకోలేక విపక్షాలపై విమర్శలు: సీతక్క

హైదరాబాద్/న్యూఢిల్లీ : దేశంలో నియంత పాలనను తీసుకొచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కుట్రలు చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ.. ప్రజలకు ఏం చేసిందో చెప్పుకోలేక విపక్షాలపై విమర్శలు గుప్పించడం సిగ్గు చేటన్నారు. ఈశాన్య ఢిల్లీ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న కన్నయ్య కుమార్‌కు మద్దతుగా టీకాంగ్రెస్ నేతలతో కలసి అక్కడ సీతక్క ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పేద మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలనూ బీజేపీ విమర్శిస్తోందని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశ ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచి ఇండియా కూటమి అధికారంలోకి రావడం తథ్యమని వ్యాఖ్యానించారు. కాగా, ఆగస్టు 15 కల్లా రైతు రుణమాఫీ అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు ప్రారంభించారని.. రుణమాఫీ కాగానే ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌లు సిద్ధంగా ఉండాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని తెలిసి.. రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లపై వారు పదే పదే రాద్ధాంతం చేశారని ఓ ప్రకటనలో మండిపడ్డారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194






## కొత్త రేషన్ కార్డుల జారీ పై రేవంత్ ప్రభుత్వం కీలక ప్రకటన..!!

తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం పాలనా పరంగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఎన్నికల సమయంలో అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామని నాడు కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పైనా భరోసా కల్పించారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు వీటి పైన ప్రభుత్వం ఫోకస్ చేసింది. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న రేషన్ కార్డుల సమస్య పరిష్కాకం కోసం మంత్రి పొంగులేటి కీలక ప్రకటన చేసారు. కొత్త కార్డుల జారీ తెలంగాణలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్దిదారుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. వాటిని స్క్రూటినీ చేసింది. ఎంత మందికి రేషన్ కార్డులు ఇవ్వాల్సి ఉంటుందనే అంచనాకు వచ్చింది. రేషన్ కార్డు ప్రాతిపదికన సంక్షేమ పథకాలు అమలు చేస్తుండటంతో..ప్రతీ నిర్ణయంలోనూ ఆచితూచి వ్యవహరిస్తోంది. కేసీఆర్ ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవటంతో చాలా మంది ఇప్పుడు కొత్తగా దరఖాస్తు చేసారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోవటం పైన లబ్దిదారుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. దీనిని గుర్తించిన కాంగ్రెస్ నేతలు కొత్త కార్డుల జారీకి నిర్ణయించారు. తాజాగా మంత్రి పొంగులేటి ఈ అంశం పైన స్పష్టత ఇచ్చారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం అవుతుందని ప్రకటించారు. ఎన్నికల కోడ్ పూర్తయిన వెంటనే దీని పైన స్పష్టమైన నిర్ణయం ఉంటుందని వెల్లడించారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగానే ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతామని, కొత్త రేషన్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపై కూడా కీలక వ్యాఖ్యలు కూడా చేశారు. రాష్ట్రంలో ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రివర్గం కసరత్తు ఇందిరమ్మ ఇళ్లతో పాటు త్వరలోనే అర్హులు అందరికీ కొత్త పెన్షన్లు, పెంచిన పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఆయన తెలిపారు. దీంతో వీటన్నింటిపై రాష్ట్ర ప్రజలు ఎంతగానో ఆశలు పెట్టుకున్నారు. అలాగే పాలేరు నియోజకవర్గం తన సొంత ఇల్లు అని, ఎన్నికల కోడ్ ముగియగానే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మొదలు పెడాతానని మంత్రి పొంగులేటి చెప్పుకొచ్చారు. ఇక..ఆగస్టు 15 లోగా రైతు రుణ మాఫీ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ పదే పదే చెప్పారు. ఈ రోజు జరుగుతున్న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని భావించినా.. ఎన్నికల సంఘం ఆంక్షలతో వాయిదా పడింది. కోడ్ ముగిసిన తరువాత నిర్ణయం తీసుకోనున్నారు.

## కవిత జ్యుడీషియల్ రిమాండ్ మళ్లీ పొడిగింపు



దిల్లీ: దిల్లీ మద్యం విధానానికి సంబంధించి సీబీఐ కేసులో భారాస ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం పొడిగించింది. జూన్ 3 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు జడ్జి కావేరి బవేజా ఉత్తర్వులు జారీ చేశారు.

ఇటీవల మే 20వరకు పొడిగించిన రిమాండ్ గడువు నేటితో ముగియడంతో అధికారులు తాజాగా కోర్టులో హాజరు పరచగా.. రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

**ఈడీ కేసులోనూ కస్టడీ పొడిగింపు :** ఈడీ కేసులోనూ కవితకు జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీటుపై కోర్టులో వాదనలు జరిగాయి. కవిత సహా నలుగురు వ్యక్తులు దామోదర్, ప్రిన్స్ కుమార్, అరవింద్‌సింగ్, చరణ్‌ప్రీత్‌పై చార్జిషీటు దాఖలు చేశామని, వారి పాత్రపై ఆధారాలను పొందుపరిచామని ఈడీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని వాదించారు. కాగా.. చార్జిషీటు దాఖలు చేసిన తర్వాత కస్టడీ అవసరం లేదని, విడుదల చేయాలని కవిత తరఫు న్యాయవాది కోర్టును కోరారు. ఇరువురి వాదనలు విన్న తర్వాత జ్యుడీషియల్ కస్టడీని జూన్ 3 వరకు పొడిగిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది.

## సెక్రటేరియట్‌కు వీసీల పంచాయతీ...




హైదరాబాద్, మే 20: రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది వర్సిటీలకు రేపటితో (మంగళవారం) పదవీకాలం ముగియనుంది. ప్రస్తుతం వీసీల పంచాయితీ సెక్రటేరియట్‌కు చేరింది. పాత వైస్ చాన్సలర్లపై ఫిర్యాదులు, కొత్త వీసీ పోస్టుల కోసం బ్యాక్ డోర్ పాలిటిక్స్ తెరపైకి వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా వీసీ పోస్టుల కోసం 1300కు పైగా దరఖాస్తులు వచ్చి చేరారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న ఒక్కో వీసీపై రెండంకెల ఫిర్యాదులు నమోదు అయ్యాయి. ఇప్పటికే కాకతీయ యూనివర్సిటీ వీసీపై విజిలెన్స్ ఎంక్వైరీకి ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. మరోవైపు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం వర్సెస్ వీసీల పంచాయతీగా పరిస్థితులు మారాయి. వారం రోజుల క్రితం సెక్రటేరియట్‌లోని బుర్ర వెంకటేశంతో తెలుగు యూనివర్సిటీ వీసీ వాగ్వాదానికి దిగిన విషయం తెలిసిందే. మరోవైపు కొత్త వీసీల నియామకానికి ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. 9 వర్సిటీలకు దాదాపు 14 వందల అప్లికేషన్లు వచ్చి చేరాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు మళ్ళీ జరగకుండా ఉండేలా సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈసీ అనుమతి ఇస్తే కొత్త వీసీలను సర్కార్ ప్రకటించనుంది. వీసీల ఎంపికకు సీఎస్ శాంతి కుమారి అధ్యక్షతన సెర్చ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. సెర్చ్ కమిటీ ఫైనల్ చేసిన ముగ్గురి పేర్లలో ఒకరిని వీసీగా గవర్నర్ నియమించనున్నారు.

## తెలంగాణ డయాగ్నస్టిక్ వ్యవస్థను కుప్పకూల్చడం బాధాకరం..



హైదరాబాద్, మే 20: రాష్ట్ర ప్రజలకు పూర్తి ఉచితంగా వైద్య పరీక్షలు అందించేందుకు బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన తెలంగాణ డయాగ్నస్టిక్ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలలలోనే కుప్పకూల్చడం బాధాకరమని మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలు చేశారు. డయాగ్నస్టిక్ కేంద్రాల్లో వైద్యులు, సిబ్బందికి పెండింగ్ జీతాల చెల్లింపుపై హరీష్‌రావు ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా 36 డయాగ్నస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేసి, 134 రకాల వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకువచ్చి వైద్య సేవల్లో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపారన్నారు. లక్షలాది నిరుపేద, సామాన్య ప్రజలకు ఆర్థిక భారం లేకుండా చేసి, నాణ్యమైన వైద్య పరీక్షలను అందించిన డయాగ్నస్టిక్ కేంద్రాలు ఇప్పుడు నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి ఏర్పడిందని.. ప్రజారోగ్యం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమని మండిపడ్డారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి డయాగ్నస్టిక్స్ కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులకు, సిబ్బందికి ఆరు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. డయాగ్నస్టిక్ కేంద్రాల ద్వారా అన్ని రకాల పరీక్షలు, వైద్య సేవలు ప్రజలకు అందే విధంగా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్‌రావు ట్వీట్ చేశారు.

## గ్రేటర్‌లో జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ల సమ్మె

హైదరాబాద్, మే 20: గ్రేటర్‌లో జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు సమ్మెకు దిగారు. సోమవారం ఉదయం నగరంలోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయాల వద్ద కాంట్రాక్టర్లు ఆందోళనకు దిగారు. కాంట్రాక్టుల సమ్మెతో నగర వ్యాప్తంగా ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. ఏడాదిన్నరగా దాదాపు రూ.1300 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమతో పనులు చేయించుకుని బిల్లులు పెండింగ్‌లో పెట్టిందంటూ కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తమను ఆదుకోవాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. అప్పుల భారంతో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ కొద్ది నెలల క్రితమే జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఈనెల 18 వరకు డెడ్‌లైన్ విధించిన విషయం తెలిసిందే. అయితే కాంట్రాక్టర్లు విధించిన డెడ్‌లైన్‌పై అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో గత శనివారం కాంట్రాక్టర్లు సమావేశమయ్యారు. బిల్లులు చెల్లించే వరకు పనులకు దూరంగా ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. అయితే రహదారుల నిర్మాణం, మరమ్మతు, నాలాల రిటైనింగ్ వాల్ నిర్మాణం, పూడికతీత, ఇతరత్రా నిర్వహణ పనులకు సంబంధించి వారికి రావాల్సిన దాదాపు రూ.1350 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వేతనాలు, అప్పుల వాయిదాల చెల్లింపునకు అవస్థలు పడుతోన్న బల్దియా.. కాంట్రాక్టర్ల బకాయిలను దీర్ఘకాలికంగా పెండింగ్‌లో పెట్టింది. ఆర్థిక సంవత్సరం ముగిసిన మార్చిలో, ఎర్లీ బర్డ్‌తో ఏప్రిల్‌లో జీహెచ్ఎంసీకి రూ.1000 కోట్లకు పైగా ఆదాయం వచ్చినా కాంట్రాక్టర్లకు బకాయిలు ఇవ్వలేదు. ఈక్రమంలో జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు సమ్మెకు దిగారు. బకాయిలు చెల్లించే వరకు సమ్మె ఆపేది లేదని కాంట్రాక్టర్లు స్పష్టం చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660